

శిథిలావస్థలో అటవీశాఖ భవనం

భీమారం: మండలంలోని ఆరెపల్లిలో 60ఏళ్ల క్రితం అటవీసంపదను కాపాడేందుకు అటవీశాఖ ఒక అధికారిని నియమించి, ఇక్కడే నివసించేందుకు భవనం నిర్మించింది. ఆ కార్యాలయం నుంచే పాలన చేయాలని నిర్ణయించినా, ఏ ఒక్క అధికారి స్థానికంగా ఉండకపోవడంతో నేడు శిథిలావస్థకి చేరింది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని, ఆ భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెరువు.. మూగజీవాలకు ఆదరువు

వేమనపల్లి: ఊరికి చెరువు ఆధారం. చెరువులో నీళ్లు ఉంటే పశుపక్షాదులకు ఎంతో హాయినిస్తుంది. ఎండలు మండిపోతున్న దశలో వేమనపల్లి వెంకటమ్మ చెరువులో పశువులతో పాటు పక్షులు చెరువులో సేదతీరడంతో కోలాహలంగా కనిపించింది. గేదెలు చెరువు నీళ్లలో సేద తీరుతుండగా పశువులు, మేకలు, గొర్రెలు నీళ్లు తాగుతూ కనిపించాయి. చెరువులో నీరుంటే పంటలకు ఆదరువు అవుతుండగా, పశుపక్షాదులకు ఆధారంగా మారింది.



కుంగిన కల్వర్టు

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి గ్రామ శివారులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ స్థలం సమీపంలో కడెం డిస్ట్రిబ్యూటరీ కాల్వను దాటేందుకు నిర్మించిన కల్వర్టు పూర్తి శిథిలావస్థకు చేరింది. కల్వర్టుపై స్లాబు కుంగి కాల్వలో పడిపోయింది. అయినా వంతెన గుండా ఇంకా రాకపోకలు సాగుతున్నాయి. అధికారులు స్పందించి కుంగిన కల్వర్టుకు వెంటనే మరమ్మతు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా గిరి ప్రదక్షిణ



వేడుకల్లో పాల్గొన్న దివాకర్‌రావు, నాయకులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని మోదెల రోడ్డులో వేంకటేశ్వరస్వామి గుట్టపై నెలకొన్న శ్రీ లక్ష్మీనర్సింహ వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై గుట్టచుట్టూ ప్రదక్షిణ చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు హాజరై విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మాసు కాంతయ్య, నాయకులు పోడేటి శ్రీనివాస్ గౌడ్, జగన్‌మోహన్ రెడ్డి, రమేశ్, మనోహర్, భక్తులు పాల్గొన్నారు.

అప్రెంటీషిప్ మేళాలో 37మందికి అవకాశం

మందమర్రిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా గల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ప్రధానమంత్రి అప్రెంటీషిప్ జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో హైదరాబాద్ నుంచి వివిధ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. 60కిపైగా అభ్యర్థులు హాజరు కాగా, 37మంది ఎంపికైనట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్ తెలిపారు.

నేడు విద్యుత్ భవన్ ఎదుట నిరసన

పాతమంచిర్యాల: ఎలక్ట్రిసిటీ స్టోర్ హమాలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిందం వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 13న పాతమంచిర్యాలలోని విద్యుత్ భవన్ ఎదుట ఉదయం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

క్రికెట్ విజేత బెల్లంపల్లి రీజియన్ జట్టు



విన్నర్‌గా నిలిచిన బెల్లంపల్లి రీజియన్ జట్టు

శ్రీరాంపూర్: సింగరేణి అధికారుల టోర్నమెంట్‌లో బెల్లంపల్లి రీజియన్ జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులుగా కొత్తగూడెంలో క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. సోమవారం జరిగిన ఫైనల్ పోటీలో బెల్లంపల్లి రీజియన్ జట్టు, కొత్తగూడెం రీజియన్ జట్టు తలపడింది. ఈ పోటీల్లో కొత్తగూడెం రీజియన్ జట్టు బ్యాటింగ్ చేసి 20ఓవర్లలో 130పరుగులు చేసింది. తరువాత బెల్లంపల్లి రీజియన్ జట్టు 17ఓవర్లలో నిర్ణీత పరుగులు సాధించి విజేతగా నిలిచింది. మహిళా విభాగం పోటీల్లో కొత్తగూడెం విజేతగా నిలువగా, బెల్లంపల్లి రీజియన్ జట్టు రన్నర్‌గా నిలిచింది.

అనధికార భవన నిర్మాణం సీజ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో అనధికారికంగా నిర్మిస్తున్న భవనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అధికారులు సోమవారం సీజ్ చేశారు. మంచిర్యాల కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి సంపత్ కథనం ప్రకారం బైపాస్ రోడ్డులో చంద్రమౌళి ఇంటి నిర్మాణం కోసం గతంలో అనుమతి తీసుకోగా, ఆ పీరియడ్ పూర్తయిందని తెలిపారు. అనుమతి కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోగా నిబంధనల మేరకు లేదని తిరస్కరించినట్లు తెలిపారు. అనుమతి ఇవ్వకపోయినా అనధికారికంగా నిర్మాణం చేపడుతుండడంతోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఆధ్వర్యంలో ఇంటిని సీజ్ చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ రఫతుల్లా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా కొవ్వొత్తుల ర్యాలీ



బెల్లంపల్లి: కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ఆర్యవైశ్యులు



భీమారంలో జాతీయరహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజనసంఘం సంయుక్త ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ బజారు ఏరియా పురవీధుల మీదుగా అంబేడ్కర్ (కాంటా) చౌరస్తా వరకు కొనసాగింది. వృద్ధులు, యువకులు, మహిళలు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, వాసవీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమారంలో...

భీమారం: మండల కేంద్రంలోని ఆవిడం చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి భారత్ సైన్యానికి మద్దతుగా యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. భారత్‌మాతాకి జై.. పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ.. నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు.

పాకిస్తాన్ వైఖరికి నిరసనగా భీమారం బంద్

భీమారం: పాకిస్తాన్ వైఖరికి నిరసనగా యువత ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం భీమారం బంద్ ప్రశాంతంగా జరిగింది. వ్యాపార సంస్థలు బంద్‌లో పాల్గొన్నాయి. రోడ్లు బోసిపోయాయి. ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు.



మూసిఉన్న దుకాణాలు

మృత్యుంజయ హోమం

భీమిని: ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని భారత సైనికులు, ప్రజలు క్షేమంగా ఉండాలని సోమవారం భీమిని మండలంలోని మల్లీడి గ్రామ పంచాయతీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మల్లీడి గ్రామానికి చెందిన సంఘర్స్ మధుకర్‌రావు–ప్రణీత దంపతుల ఆధ్వర్యంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా నర్సింగ్ దినోత్సవం



నర్సులను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్



స్టెప్పులు వేస్తున్న సూపరింటెండెంట్, నర్సులు

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 8 డిస్పెన్సరీలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ఏరియా జీఎం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సుల పితామహురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సులు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఉత్తమ సేవలు చేసిన నర్సులను సన్మానించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ, డీజీఎం(పర్సనల్) అరవింద రావు, డిప్యూటీ సీఎంవో రమేశ్ బాబు, వైద్యులు మురళీధర్, ఫిట్ సెక్రెటరీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

చెన్నూర్ సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ స్టెప్పులు

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నర్సుల దినోత్సవంలో భాగంగా హంగామా సృష్టించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ చాంబర్‌లో సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి సినిమా పాటలకు నృత్యం చేశారు. సూపరింటెండెంట్ సత్యనారాయణ నర్సులతో కలిసి స్టెప్పులు వేశారు. జిల్లా వ్యాప్తంగా నర్సుల దినోత్సవం సందర్భంగా కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకోగా, చెన్నూర్ సీహెచ్‌సీలో మాత్రం నర్సుల దినోత్సవాన్ని ఈలలు, కేరింతల మధ్య డ్యాన్స్‌లు చేస్తూ సందడి చేశారు. సూపరింటెండెంట్ డ్యాన్స్‌లు చేయడం ఏమిటని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు ముక్కున వేలేసుకున్నారు. రోగులకు ఇబ్బంది కలిగేలా సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి, స్టెప్పులు వేయడంపై చెన్నూర్ పట్టణంలో చర్చానీయాంశంగా మారింది.

వేతనాలు చెల్లించాలని వినతి

మందమర్రిరూరల్: ఏరియాలో సులభ్‌కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే వారి వేతనం చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) సహాయ కార్యదర్శి ఎండీ జాఫర్ డిమాండ్ చేశారు. ఏరియా డీఈ రాములుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్మికులకు వేతనాలు చెల్లించాలని అడిగితే కాంట్రాక్టర్లు బిల్లులు రావడం లేదని చెబుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల వేతనాలు చెల్లించకపోతే వారికి జీవనోపాధి ఎలా అని ప్రశ్నించారు. ఆయన వెంట సులభ్‌కాంప్లెక్స్ కార్మికులు భూమయ్య, రాములు, శ్రీనివాస్, కనకయ్య, ఈశ్వరి, తదితరులు ఉన్నారు.



డీఈకి వినతిపత్రం ఇస్తున్న జాఫర్

సంక్షిప్త వార్తలు

సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు

చెన్నూర్: దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని కోరుతూ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సత్యనారాయణకు మంచిర్యాల జిల్లా ఐద్యా కార్యదర్శి ఉమారాణి ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకురాళ్లు సమ్మక్క, రమాదేవి, యామినిలు పాల్గొన్నారు.

బుద్ధుడి అష్టాంగ మార్గాలు అనుసరణీయం

బెల్లంపల్లి: గౌతమ బుద్ధుడు అనుసరించిన అష్టాంగ మార్గాలు నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సింగరేణి సంఘ మిత్ర ఫిరమిడ్ ధ్యానమందిర్ నిర్వాహకులు అన్నారు. సింగరేణి సంఘమిత్ర ఫిరమిడ్ ధ్యాన మందిర్‌లో బుద్ధపౌర్ణమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం సింగరేణి సంఘమిత్ర ఫిరమిడ్ ధ్యానమందిర్ కేంద్రం వద్ద నుంచి శాఖాహారులు పురవీధుల మీదుగా ప్లకార్డులతో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సింగరేణి సంఘ మిత్ర ఫిరమిడ్ ధ్యానమందిర్ సీనియర్ మాస్టర్లు ఆలేటి లక్ష్మణ్, కాసిపేట మల్లేశ్, పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు అగ్గి భీమయ్య, పందిళ్ల యాదగిరి, పుల్లూరి శిరీష తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు వెళ్లి.. స్పృహతప్పి పడిపోయి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామానికి చెందిన సల్లం రాయపోసు సోమవారం ఉదయం సమీప అటవీ ప్రాంతానికి తునికాకు సేకరణకు వెళ్లింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తునికాకు సేకరణలో ఎండవేడికి అలసిపోయి స్పృహ తప్పి కిందపడిపోయింది. వెంటనే రాయపోసును మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

తుతుంగ లెఫ్ట్ కెనాల్‌కు మరమ్మతు కరువు

కోటపల్లి: మండలంలోని ఎదులబంధం గ్రామానికి సమీపంలోని తుతుంగ వాగు ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ గత సంవత్సరం వర్షాలకు కొట్టుకపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు ఇప్పటి వరకు మరమ్మతు చేయించడంలేదు. గతేడాది కురిసిన వర్షాలకు వరద పోటెత్తడంతో తుతుంగ చెరువు లెఫ్ట్‌కెనాల్ కోతకు గురై రోడ్డు ధ్వంసమై పది గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ సమయంలో అధికారులు కెనాల్ కాలువకు తాత్కాలిక మరమ్మతు చేయించి చేతులు దులుపేసుకున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతోనే తుతుంగ చెరు వు కాలువ పూర్తిగా ధ్వంసమై చుక్క నీరు లేకుండా వృథాగా పోవడంతో సాగు చేసుకోవడానికి నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం రాకముందే మరమ్మతు చేయించాలని వే డుకుంటున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ వెంకటస్వామిని వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించాం. అక్విడెట్ సమస్యను వర్షాకా లం ముందే కాలువ మరమ్మతు చేయిస్తామన్నారు.



మరమ్మతులకు నోచుకోని తుతుంగ కెనాల్



దెబ్బతిన్న లెఫ్ట్ కాలువ

పట్టాలు ఇప్పించాలని వినతి

నెన్నెల: గత 30ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలిప్పించాలని, నిరుపేద గిరిజన రైతులకు భూములివ్వాలని సోమవారం బెల్లంపల్లిలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లకు నెన్నెల, కోణంపేట, బోగంపల్లి గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతాల్లోని పోడు భూముల్లో వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నామని గిరిజనులు వారి దృష్టికి తీసుకెళ్లారు. కోణంపేట, బోగంపల్లి గ్రామాలకు బీటి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని పోడు భూములకు సర్వే చేయించి పట్టాలు అందేలా చూడాలని కోరారు. సీఎం గిరివికాస పథకం నుంచి బోర్లు మంజూరైనప్పటికీ కరెంట్ సౌకర్యం కల్పించాలని, సోలార్ పంపుసెట్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో మాట్లాడారు. అర్హులైన గిరిజన దళిత నిరుపేద రైతులకు భూములివ్వాలని ఆర్డీవోను ఆదేశించారు. నిరుపేదలకు సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన రైతులు జంబి బాపు, ఈగం లక్ష్మి, ఈగం మధునయ్య, భట్టు మారయ్య, కాంగ్రెస్ నాయకులు తోట శ్రీనివాస్, కోణంపేట, బోగంపల్లి గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తూ...

పోడు భూముల సమస్యలు పరిష్కరించండి

వేమనపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో అటవీ అధికారులు 30సంవత్సరాల నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులను అడ్డుకుంటున్నారని మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. అటవీ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తూ సాగుకు అడ్డు తగులుతున్నారని హక్కు పత్రాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వీరి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్ ఆలీ, ఒడిళ్ల రాజన్న ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్

జన్నారం: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. స్థానిక హరిత రిసార్ట్ వద్ద ఆదివాసీ గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, ఏఐసీసీ జాతీయ శిక్షణ కన్వీనర్ రాహుల్‌బల్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యతో కలిసి జన్నారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల్లోని చెత్త తొలగించారు. అంతకుముందు హరిత రిసార్ట్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. జై బాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమం చేపట్టారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి ఆవరణలో చెత్త తొలగిస్తున్న ఎమ్మెల్యే

హక్కు పత్రం ఉంటేనే సాగు చేసుకోండి

- రేంజ్ అధికారి అప్పలకొండ

వేమనపల్లి: అటవీ భూముల్లోకి వెళ్లి అక్రమ సాగుకు పాల్పడితే కేసులు తప్పవని నీల్వాయి రేంజ్ అధికారి అప్పలకొండ అన్నారు. మండలంలోని బద్దంపల్లి, చామనపల్లి, గొర్లపల్లి, కాటేపల్లి, నీల్వాయి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆర్వో ఎఫ్‌ఆర్ హక్కు పత్రాలు ఉన్నవారు మాత్రమే తమ హద్దులలో సాగు చేసుకోవాలని, కొత్తగా పోడు సాగు కోసం పొరకలు నరకడం, చదును చేయడం లాంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓలు స్వరూప, స్వామి, ఎఫ్‌బీవోలు మహిపాల్, స్రవంతి, హేమంత్, మధుకర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

ప్రభుత్వం దృష్టికి సింగరేణి సమస్యలు

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, మందమర్రిలో ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవీ భూమయ్య పేర్కొన్నారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో, మందమర్రి ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్యాలయంలో సోమవారం వేర్వేరుగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 8, 9 తేదీల్లో తమ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నేతృత్వంలో కార్మికుల సమస్యలపై ప్రతినిధి బృందం రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు, సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌తో చర్చించామన్నారు. కొత్త గనులు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కోయగూడెం, సత్తుపల్లి, తాడిచర్ల గనులను సింగరేణికి కేటాయించాలన్నారు. వీటిపై వారంతా సానుకూలంగా స్పందించారన్నారు. వీటి పరిష్కారం కోసం ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు గరిగే స్వామి, కలవేని శ్యాం, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, నాయకులు పేరం రమేశ్, తిరుపతిరెడ్డి, జీవన్ జోయల్, భీం రవి, మందమర్రిలో ఆ యూనియన్ నాయకులు నరేందర్, వెంకటస్వామి, బాపు, ఆలుగుల రవి, శ్రీనివాస్, లక్ష్మణ్ దాసు, సమ్మయ్య, భిక్షపతి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జెట్టి శంకర్‌రావు

బోర్లు ఏర్పాటు

చెన్నూర్‌రూరల్: విశాఖ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లింగంపల్లి, ఎర్రగుంటపల్లి గ్రామాల్లో సోమవారం బోర్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎర్రగుంటపల్లి కాంగ్రెస్ నాయకులు రామన్న, సమ్మయ్య, సత్తయ్య, లింగంపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మి, రమేశ్, పవన్ పాల్గొన్నారు.